అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆదివారం 25 జనవరి 2026 పేజీలు : 04

రామగిరి మండలం వెంకటాపురం గ్రామంలో మాజీ మంత్రి పరిటాల రవీంద్ర వర్ధంతి కార్యక్రమం దృశ్యాలు

21వ వర్ధంతి సందర్భంగా పరిటాల రవికి ఘన నివాళి

జనసంద్రంగా మారిన వెంకటాపురం

- మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 21వ వర్ధంతి సందర్భంగా భారీగా తరలివచ్చిన అభిమానులు
- ఘాట్ వద్ద నివాళులర్పించిన పరిటాల సునీత, శ్రీరామ్, ఎమ్మెల్యేలు , ఎంపీ, ఇతర ప్రముఖులు రాక

రామగిరి, జనవరి 24 ప్రభాతవార్త

శ్రీ సత్య సాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం వెంకటాపురం గ్రామం శనివారం జన సముద్రంగా మారింది. దివంగత నేత, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 21వ వర్ధంతి పురస్కరించుకొని వెంకటాపురం గ్రామానికి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రాంతాల నుంచి, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల నుంచి అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి పరిటాల రవీంద్ర పై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారూ. రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న పరిటాల రవీంద్ర కు అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు వెంకటాపురంలోని పరిటాల రవీంద్ర ఘాటు వద్ద ఘన నివాళి అర్పించారు. రామగిరి మండలం వెంకటాపురంలో మాజీ మంత్రి టిడిపి నాయకుడు పరిటాల రవీంద్ర 21వ వర్ధంతి పురస్కరించుకొని ముందుగా తమ కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే సునీత శ్రీరామ్ పరిటాల ఘాట్ వద్ద ప్రత్యేక పూజలు చేసి ఘనంగా నివాళులర్పించారు. ఆ తర్వాత వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పరిటాల ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్, ఇతర కుటుంబ సభ్యులతో కలసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, అనంతపురం జిల్లా టిడిపి అధ్యక్షుడు పూల నాగరాజు, ఎడిసిసి బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, అనంతపురం జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, టిడిపి జిల్లా నేతలు ఆలం నరసానాయుడు, రామలింగా రెడ్డి, గడ్డం సుబ్రహ్మణ్యం, బాంబే దయింగ్ నాగన్న , ఎల్ నారాయణ చౌదరి, రామ్మోహన్ చౌదరి,ఇతర ముఖ్య నాయకులు వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత, ధర్మవరం టిడిపి ఇన్ ఛార్జ్ శ్రీరామ్ మాట్లాడుతూ రాజకీయాల్లో తనకంటూ ఒక చరిత్ర సృష్టించిన మాజీ మంత్రి పరిటాల రవీంద్ర చనిపోయి 21సంవత్సరాలు గడుస్తున్నా.. అభిమానుల గుండెల్లో నేటికీ ఆయన చిరస్థాయిగా ఉన్నారన్నారు. ఆయన అభిమానులు ఎక్కడ ఉన్నా ఈరోజు నివాళులర్పించడం చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. ఒకప్పుడు పీడిత ప్రజల కోసం ఆయన చేసిన పోరాటాల గురించి మాకు తెలియని ఎన్నో విషయాలు ఆయన సహచరులు, ఆరోజు ప్రత్యక్షంగా చూసినవారు నేటికీ చెబుతుంటారన్నారు. ఎన్టీఆర్ ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి వచ్చి... ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో ఈ ప్రాంతానికి ఎన్నో సేవలు అందించారన్నారు. పేరూరు ప్రాజెక్టుకు నీరు అందించాలన్నది ఆయన చిరకాల స్వప్నమని.. అయితే ఆ రోజు ఉన్న పరిస్థితుల్లో వీలు కాలేదన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పరిటాల రవీంద్ర కాలువ పేరుతో ఈ ప్రాజెక్టును ప్రారంభించినా ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని పూర్తిగా పక్కన పెట్టిందన్నారు. మళ్ళీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టుకు మరోసారి నిధులు కేటాయించారని.. రేపటి రోజు ఆ పనులు ప్రారంభమవుతాయని వారు తెలిపారు. పరిటాల రవి ఆశయ సాధన కోసం ఊపిరి ఉన్నంతవరకు తాము కృషి చేస్తామని సునీత, శ్రీరామ్ స్పష్టం చేశారు...

మన చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఇన్చార్జి కలెక్టర్, అర్బన్ ఎమ్మెల్యే, కమిషనర్ తదితరులు

- ఇంట్లోని వ్యర్థాలు పడవేయకుండా జాగ్రత్తగా హోం కంపోస్టింగ్ చేసుకుని, వనరులుగా మార్చుకొని ఉపయోగించుకోవాలి : ఇంచార్జి జిల్లా కలెక్టర్ సి.విష్ణు చరణ్
- నగరంలోని నవోదయ కాలనీలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇంటి వద్ద కంపోస్టింగ్ పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఇంచార్జి జిల్లా కలెక్టర్ సి.విష్ణు చరణ్, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌లు

అనంతపురం, జనవరి 24 ప్రభాతవార్త

అనంతపురం నగరంలోని నవోదయ కాలనీలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఇంటి వద్ద కంపోస్టింగ్ (సస్టైనబుల్ సానిటేషన్ అండ్ వేస్ట్ మేనేజ్మెంట్) పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఇంచార్జి జిల్లా కలెక్టర్ సి.విష్ణు చరణ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెప్మా సౌజన్యముతో హోం కంపోస్ట్ (ఇంట్లోనే ఎరువు తయారు చేసుకోవడం)ను సల్మా, రేష్మాలు చేపట్టగా, వారి ఇంట్లో చేపట్టిన కంపోస్టింగ్ ను ఇంచార్జి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, తదితరులు పరిశీలించారు. హోం కంపోస్ట్ ఎలా చేపట్టారు, తడి, పొడి చెత్త వేరుచేసి ఎలా ఎరువు తయారు చేశారు, వాటి ఉపయోగాలు, తదితర వివరాలను వారు ఆరా తీశారు. ఈ సందర్భంగా మీడియాతో ఇంచార్జి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతినెలలో కూడా మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించుకోవడం జరుగుతోందని, అందులో భాగంగా నాలుగో శనివారం అయినప్పటికీ స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర నిర్వహించాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతినెలా ఒక థీమ్ ఇవ్వడం జరుగుతుందని, "జీరో గ్యాప్ సానిటేషన్ ఆంధ్ర" అనే థీమ్ తో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, శానిటేషన్ విషయం వచ్చినప్పుడు మన చుట్టూ పరిసరాలు ఏవైతే ఉన్నాయో పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పారిశుధ్య కార్మికులు ఎవరైతే ఉన్నారో వారు గౌరవప్రదంగా పనిచేసుకోవాలి, దానివల్ల మనకు వచ్చే ఆరోగ్య ఫలితాలను మరింత మెరుగుపరచుకోవాలనేది ఈ థీమ్ యొక్క మెయిన్ విజన్ అన్నారు. అందులో భాగంగా ఈరోజు అర్బన్ లోని ఒక ఇంటికి రావడం జరిగిందని, స్థానిక ఎమ్మెల్యే కూడా ఇందులో పాల్గొన్నారన్నారు. హోం కంపోస్టింగ్ అంటే వ్యర్థాలు పడవేయకుండా జాగ్రత్తగా హోం కంపోస్టింగ్ చేసుకుని, వనరులుగా మార్చుకొని ఉపయోగించుకోవాలని, దానిని మెప్మా సౌజన్యంతో ఏర్పాటు చేసిన హోం కంపోస్టింగ్ ను సభ్యులు జాగ్రత్తగా చేసి చూపించారన్నారు. మొక్కలు ఎలా నాటుతున్నారు, ఎలా పెంచుతున్నారు, దాని వల్ల ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయో తెలియజేశారన్నారు. వారు చేపట్టిన ఈ కార్యక్రమం మరింత పెద్దఎత్తున అభివృద్ధి చేసేలా మెప్మా పరిధిలో ముందుకి వెళ్లాలని, హోమ్ కంపోస్ట్ పై మెప్మా, మున్సిపల్ కమిషనర్ భాగస్వామిఅవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని, గతవారం పండుగ వల్ల నిర్వహించలేదని, నాల్గవ శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా వినూత్నంగా ఒక ఇంటిని సందర్శించడం జరిగిందని, ఇంట్లో ఏవైతే వ్యర్థాలు వస్తున్నాయో వాటిని బయటపడకుండా ఆ వ్యర్థాలను కంపోస్ట్ గా మార్చుకుంటూ ఇంట్లో గార్డెన్ ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఆ గార్డెన్ నుంచి రకరకాల పండ్లు, కూరగాయలు, లాంటివి పండించడం జరుగుతోందని, ముఖ్యంగా ఒక మొక్క నుంచి హెయిర్ డ్రై పౌడర్ తీస్తోందని, క్వాంటిటీ తక్కువగా వస్తోందని, మెప్మా ద్వారా మరింత ఎక్కువ క్వాంటిటీ వచ్చేలా అవగాహన కల్పించాలని తెలియజేయడం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతి నియోజకవర్గంలోనూ ఒక ఎంఎస్ఎమ్ఈ పార్క్ ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఎంఎస్ఎమ్ఈ ద్వారా ఒక స్టాల్ కూడా సల్మాకి ఇప్పించే ఏర్పాటు చేస్తామన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు అభివృద్ధి చెందాలని సీఎం గారి ఆకాంక్ష అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ బల్లా పల్లవి, నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, పిడి మెప్మా విశ్వజ్యోతి, ఎంహెచ్ఓ ఇంచార్జి డిఈ నరసింహులు, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కోఆర్డినేటర్ వెంకటేష్, నవోదయ కాలనీ సచివాలయం సిబ్బంది, మెప్మా టిపిఆర్ఓ తదితరులు పాల్గొన్నారు.

పరిటాల రవీంద్రఘాట్ వద్ద ధర్మవరం టీడీపీ నాయకులు ఘన నివాళులు

వెంకటాపురంలో పరిటాల రవి ఘాట్‌కు నివాళులర్పిస్తున్న ధర్మవరం టీడీపీనాయకులు

ధర్మవరంటౌన్,జనవరి24 ప్రభాతవార్త

మాజీమంత్రి స్వర్గీయ పరిటాల రవీంద్ర 21వ వర్ధంతి సందర్భంగా ధర్మవరం టీడీపీ నాయకులు ఘన నివాళులర్పించారు. ధర్మవరం నుంచి వెంకటాపురంకు బారీ ఎత్తునవెళ్లి పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాలశ్రీరామ్ తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... పరిటాల రవీంద్ర పెత్తం దారులు, భూస్వాములకు ఎదురొడ్డి సింహస్వప్నంలా మారి పేదవర్గాల అభ్యున్నతికి పోరాటాలు చేసిన నాయకుడని కొనియాడారు. ఆయన బతికున్న రోజుల్లో ఉమ్మడిజిల్లాలో టీడీపీలోనే ఎదురులేని మనిషిగా ఉండేవారన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, చింతలపల్లి మహేశ్ చౌదరి, పణికుమార్, పరిశేసుదాకర్, సందారాఘవ, సంధారవీంద్ర,నాగూర్ హుస్సేన్, రాళ్లపల్లిషరీఫ్, భీమనేని ప్రసాద్ నాయుడు, పోతుకుంట లక్ష్మన్న,జింకా పురుషోత్తం, సంధారవీంద్ర, కొత్తపేటఆది,గుడి పాటిచంద్ర, కేశగాళ్లశీన, బొట్టు కృష్ణ,జింకలరాజన్న, పూజ మొబైల్ సాయి, దుర్గా నగర్ బాబు, సాయి కృష్ణ, భాస్కర్ చౌదరి, చిన్నూరువిజయ్,అమరాసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురము జిల్లాలో భూముల మార్కెట్ విలువలు ఫిబ్రవరి నుంచి పెంపు

- జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్

అనంతపురం న్యూటౌన్, జనవరి 24 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని వ్యవసాయ, వ్యవసాయేతర, నివాస స్థలాల మార్కెట్ విలువలను సవరించడం జరుగుతోందని ఈ నూతన ధరలు ఫిబ్రరి నుంచి అమల్లోకి వస్తాయని జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేద్దాం

- పని చేసే వారికే పదవుల్లో ప్రాధాన్యత కల్పించండి
- వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం సిటీ, జనవరి 24 ప్రభాతవార్త

సంస్థాగతంగా పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేద్దామని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా వైసిపి కార్యాలయంలో శనివారం క్లస్టర్ కన్వీనర్లు, సచివాలయ పరిశీలకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు, అర్బన్ నియోజకవర్గ సమన్వయకర్త అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. పార్టీని సచివాలయాల వారీగా బలోపేతం చేసేందుకై కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. అందులో భాగంగానే పార్టీ కమిటీలతోపాటు అనుబంధ కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతోందని పేర్కొన్నారు. పార్టీ కమిటీలలో పార్టీకి నిబద్ధతతో పని చేసి కష్టపడే వారికే అవకాశం కల్పించాలని ఆయన సూచించారు. యువత సోషల్ మీడియా మహిళా విభాగం కమిటీలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వైసిపి హయాంలో ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గడపకు సంఏమాన్ని అందించారని, నేడు ఆ సంక్షేమం ప్రజలకు అందడం లేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వారికిసూచించారు. ఫిబ్రవరి 10లోపు కమిటీలన్నింటినీ పూర్తి చేయాలని ఆయన సూచించారు. సమన్వయంతో పనిచేద్దాం, మరోమారు వైసిపి జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు.

అగ్నికి ఆహుతి అవుతున్న అడవులు..

- వేలాది ఎకరాల్లో జంతుజాలం సజీవ దహనం
- అరికట్టలేక పోతున్న అధికార యంత్రాంగం
- ఆధునిక టెక్నాలజీని ఉపయోగించలేరా?



అటవీ ప్రాంతంలో చెలరేగుతున్న కార్చిచ్చు దృశ్యాలు

బుక్కపట్నం, జనవరి 24, ప్రభాతవార్త

మానవాళితో పాటు భూమిపై నివశించే సమస్త జీవరాశులకు ఊపిరి అందించే అద్భుతమైన ప్రకృతి వనరులు అడవులు, ఇప్పటికే మానవ అవసరాలకు లక్షలాది పచ్చని చెట్లను ప్రతి రోజూ నేలకూలుస్తూ వాతావరణ సమతూల్యతను దెబ్బతీస్తున్న 'మనీ'షి.... ఉత్తి పుణ్యానికి అడవులకు నిప్పు పెడుతూ కోట్లాది చెట్లను అగ్నికి ఆహుతి చేస్తుండడం కడు శోచనీయం. ఈ క్రమంలో గత 10 రోజులుగా బుక్కపట్నం ఫారెస్ట్ రేంజ్‌లో కొంత మంది దుండగులు నిప్పు రాజేస్తూ అడవుల సమూల నాశనానికి ఒడిగడుతుండడం విస్మయం కలిగిస్తోంది. ఒక వైపు అడవులు సంరక్షణకు తగిన చర్యలు తీసుకుంటున్నామంటూ అధికారులు ప్రకటనలు, హెచ్చరికలకే పరిమిత మౌతుండగా, అడవులు అగ్నికీలలకు బలౌతూ కోట్లాది వృక్ష సంపద కాలి బూడిద అవుతోంది. ప్రాణవాయువు అందించే పచ్చని చెట్లు కోల్పోతే ఎన్నో రకాల రుగ్మతలకు, ఆరోగ్య సమస్యలకు గురవుతామని అధికారులు తెలియ జెబుతూ అరకొర ప్రయత్నాలు సాగిస్తున్నప్పటికీ, పూర్తి స్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పించలేకపోవడంతో అసలు లక్ష్యం నీరుగారి పోతోంది. వివిధ పశువుల కాపరులు అడవుల్లోని ఎండు గడ్డికి నిప్పు పెట్టడం ద్వారా త్వరగా పశుగ్రాసం పెరుగుతుందన్న అపోహతో కావాలని నిప్పు పెట్టడం మూలంగానే అడవుల్లో కార్చిచ్చు రగులుతోంది. తద్వారా వేలాది ఎకరాల్లో అగ్నికీలలు ఎగసి పడి ఎన్నోరకాలైన జంతుజాలాలు సజీవ దహనం అవుతున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో విత్తులు విత్తకుండానే సహజ సిద్ధంగా పిచుకలు, వివిధ రకాల జంతువులు, పక్షులు, పశు సంపద వలన మొలకెత్తే మొక్కలు యేడాదికేడాది అడవులకు నిప్పు పెట్టడం మూలంగా నాశనమౌతున్నాయి. ఈ అడవులలో సహజసిద్ధంగానే వివిధ రకాల ఔషధ మొక్కలు సైతం పెరుగుతుండడంతో ఎంతో మంది వాటిని సేకరించి వివిధ ఆయుర్వేద కంపెనీలకు తరలిస్తుంటారు కూడా. ఒక ప్రక్క అటవీ శాఖ అధికారులు అటవీ సమీప గ్రామస్తుల సహకారంతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ వారి ప్రయత్నం ఆశాజనకంగా మారడం లేదు. ఇదిలాగే కొనసాగితే అటవీ సంపద కనుమరుగై త్వరలోనే ఎడారిగా మారే ప్రమాదముందని పలువురు మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అటవీ అధికారులకు మంటలను అదుపుచేసే తగిన పరికరాలను అందించడంలో విఫలమౌతున్నట్లు విశ్లేషకులు తెలియజేస్తు న్నారు. ఇలా అడవులు ఆహుతి అవడం వల్ల వర్షా భావ పరిస్థితులు నెలకొనడంతో పాటు వాటి ద్వారా ఉద్భవించి పొగ, బూడిద వలన పర్యావరణం దెబ్బతింటున్నది. అలాగే భూములు కూడా సారవిహీనం అయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రస్తుతం ఉన్న ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి మంటలను అదుపు చేయడానికి డ్రోన్‌లను ఉపయోగించుకునేలా ప్రభుత్వానికి నివేదికలు పంపాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. రక్షణ, వ్యవసాయ రంగాల్లో సైతం కీలక భూమిక వహిస్తున్న డ్రోన్ టెక్నాలజీని అడవుల సంరక్షణకు ఎందుకు ఉపయోగించలేరా? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. భవిష్యత్ తరాలకు పచ్చదనంతో కూడిన పర్యావరణంను అందించాల్సిన బాధ్యత నేటి ప్రభుత్వాలపై కూడాఉంది. అడవులలో నివశించే జీవరాశులను సంరక్షించడంతో పాటు సహజవనరులను రక్షించడం మూలంగా కలిగే దీర్ఘకాలిక ప్రయోజనాలను సైతం ప్రజలకు, విద్యార్థులకు తెలియజేయడం ఎంతో అవసరం. ఇప్పటికైనా అటవీ అధికారులు అడవుల సంరక్షణపై చుట్టు ప్రక్కల గ్రామాలలోని ప్రజలకు అవగాహన కల్పించి అడవుల యొక్క ప్రాధాన్యతను విడమర్చి చెప్పడంతో పాటు నూతన టెక్నాలజీని వినియోగించుకొని అడవులను సంరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో అట్టహాసంగా ALUMA 2K26 పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- కళాశాల గౌరవాన్ని ప్రపంచవ్యాప్తం చేయాలి: చైర్మన్ డా. పల్లె కిషోర్
- క్రమశిక్షణ, నిరంతర కృషితోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు: కరస్పాండెంట్ డా. పల్లె రఘునాథ రెడ్డి

అనంతపురం, జనవరి 24,(ప్రభాతవార్త బ్యూరో)

అనంతపురంలోని ప్రముఖ విద్యాసంస్థ పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ALUMA 2K26 అత్యంత వైభవంగా జరిగింది. వివిధ సంవత్సరాల్లో ఇక్కడ చదువుకుని, ప్రస్తుతం దేశ విదేశాల్లో ఉన్నత హోదాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరూ ఒక్కచోట చేరి తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన కళాశాల చైర్మన్ డా. పల్లె కిషోర్, కరస్పాండెంట్ డా. పల్లె రఘునాథ రెడ్డి, మేనేజ్మెంట్ ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా. బండి రమేష్ బాబు, డీన్ డా. సంతోష్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ డా. పల్లె కిషోర్ మాట్లాడుతూ: "కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులే నిజమైన బ్రాండ్ అంబాసిడర్లు. మీరు సాధించే విజయాలే ఈ సంస్థకు గర్వకారణం. సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుంటూ, మీరు చదివిన సంస్థ గౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పాలి. మీ అనుభవాలను ప్రస్తుత విద్యార్థులకు పంచుతూ వారికి మార్గదర్శకులుగా నిలవాలి" అని పిలుపునిచ్చారు. కరస్పాండెంట్ డా. పల్లె రఘునాథ రెడ్డి విద్యార్థులకు సందేశమిస్తూ: "నేటి పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే కేవలం డిగ్రీలు ఉంటే సరిపోదు, నిరంతర అభ్యాసం, క్రమశిక్షణ అత్యంత అవసరం. పీవీకేకే సంస్థ ఎప్పుడూ నాణ్యమైన విద్యకు, నైతిక విలువలకు పెద్దపీట వేస్తుంది. ఇక్కడి నుండి వెళ్ళిన విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే గొప్ప వ్యక్తులుగా ఎదగడం చూడటం మాకు ఎంతో సంతోషాన్నిస్తుంది. జీవితంలో ఎంతటి ఉన్నత స్థానానికి ఎదిగినా మూలాలను మర్చిపోకూడదు" అని సూచించారు .అనంతరం మేనేజ్మెంట్ ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్ బలోపేతం చేయడం ద్వారా ప్రస్తుత విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ మరియు ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్‌లో ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్ డా. బండి రమేష్ బాబు, డీన్ డా. సంతోష్ రెడ్డి కళాశాల సాధిస్తున్న పురోగతిని వివరించారు. ఈ సమ్మేళనానికి భారీ సంఖ్యలో హాజరైన పూర్వ విద్యార్థులు తమ స్నేహితులు, అధ్యాపకులతో కలిసి సరదాగా గడిపారు. తమ విజయ ప్రస్థానంలో పీవీకేకే ఐటీ పోషించిన పాత్రను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల హెచ్ఓడీలు, అధ్యాపక బృందం మరియు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

కరువు సీమలో మెరిసిన 21మంది ప్రతిభావంతులకు అనంత ఆణిముత్యాలు పురస్కారాలు

- పురస్కార గ్రహీతలను స్ఫూర్తిగా తీసుకొని యువత ఉన్నత స్థాయికి ఎదగాలి
- హాస్యబ్రహ్మ ప్రముఖ సినీ హాస్య నటులు బ్రహ్మానందం

మాట్లాడుతున్న ట్రస్ట్ అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి

అవార్డు అందుకుంటున్న తెలంగాణ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు

పెనుకొండ జనవరి 24 (ప్రభాతవార్త)

ఉమ్మడి అనంతపురం జిల్లా నుండి వివిధ రంగాలలో ఉన్నత స్థాయిలో ప్రతిభవంతులుగా ఉండి అనంత ఆణిముత్యాలు అవార్డులు అందుకుంటున్న అవార్డు గ్రహీతలను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత, విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని హాస్యబ్రహ్మ ప్రముఖ హాస్య సినీనటులు బ్రహ్మానందం తెలిపారు. పెనుకొండ లోని సాహితీ గగనమహల్ ట్రస్ట్ 9వ అనంత ఆణిముత్యాలు పురస్కార ప్రధానోత్సవం శనివారం పట్టణములోని జూనియర్ కళాశాల మైదానంలో సాహితీ గగన్ మహల్ ట్రస్ట్ అధ్యక్షులు న్యాయవాది జూటూరు ప్రతాపరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా అవార్డు గ్రహీతలు తెలంగాణ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కే. రామకృష్ణారావు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి కే.సురేష్ రెడ్డి, తదితరులు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో గ్రామీణ ప్రాంతాలలోని రైతు కుటుంబాలు, సాధారణ కుటుంబాల నుండి వివిధ రంగాలలో ఉన్నత స్థాయికి ఎదిగిన ప్రతిభావంతులను గుర్తించి ఒకచోటకు చేర్చి అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించిన సాహితీ గగన్ మహల్ ట్రస్ట్ అధ్యక్షులు న్యాయవాది ప్రతాప్ రెడ్డి అభినందనీయులని తెలిపారు. న్యాయవాది ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ గత 27సంవత్సరాల నుండి ట్రస్ట్ ద్వారా దాదాపు 200 మంది ఉమ్మడి అనంతపురం జిల్లా లోని ప్రతిభావంతులకు అనంత ఆణిముత్యాలు పురస్కారాలు అందజేశామని తెలిపారు. అనంతరం వివిధ రంగాలలోని 21మంది ప్రతిభావంతులకు అనంత ఆణిముత్యాలు పురస్కారాలు హాస్యబ్రహ్మ బ్రహ్మానందం పురస్కార అవార్డులు అందజేశారు. పురస్కార గ్రహీతలు పరిపాలన రంగం నుండి తెలంగాణ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కే.రామకృష్ణారావు గుత్తి గ్రామం,న్యాయరంగం నుండి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేష్ రెడ్డి సింగనమల మండలం తరిమెల గ్రామం, పోలీస్ రంగం నుండి రిటైర్డ్ డిజిపి డాక్టర్ కే.అరవిందరావు గోరంట్ల మండలం కమ్మవారిపల్లి,విద్యారంగం బెంగళూరుకు చెందిన ఐ ఐ ఎస్ సి ప్రొఫెసర్ వై.నరహరి హిందూపురం,పారిశ్రామిక రంగం స్టేట్ ఫిట్ ఫౌండర్ డాక్టర్ గురుకులం గణపతిరె

క్యాంపస్ సెలెక్షన్స్‌లో ఎంపికైన బోరంపల్లి పాలిటెక్నిక్ విద్యార్థులు

క్యాంపస్ సెలక్షన్స్‌లో ఎంపికైన పాలిటెక్నిక్ విద్యార్థులు

కళ్యాణదుర్గం జనవరి 24 ప్రభాతవార్త

మండలంలోని బోరంపల్లి గ్రామంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 7 మంది సివిల్ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ విద్యార్థులు అనంతపురంలో నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్లలో ఉద్యోగాలకు ఎన్నికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ తిప్పేస్వామి తెలిపారు. బెంగళూరుకు చెందిన కల్పతరు ప్రాజెక్ట్ ఇంటర్నేషనల్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్ లో బోరంపల్లి పాలిటెక్నిక్ విద్యార్థులు రూ 3.30 లక్షల ప్యాకేజీతో ఎంపిక కావడం ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజనీరింగ్ లెక్చరర్ నరేష్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

వైసీపీ మండల విస్తృత సమావేశం

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

కనేకల్ జనవరి 24 ప్రభాతవార్త

కణేకల్లు మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక దృష్టి దృష్టి పెట్టి గ్రామస్థాయి నుండి పార్టీని బలపతం చేయాలని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు మారంపల్లి మారెన్న అన్నారు. కనేకల్లు మండల స్థాయి విస్తృత సమావేశం స్థానిక కార్యాలయం నందు శనివారం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉషారాణి, మాజీ ఎంపీపీ ఆలేరు రాజగోపాల్ రెడ్డి కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, గ్రామస్థాయిలో కమిటీల ఏర్పాటు, అనుబంధ విభాగాల పునర్వ్యవస్థీకరణ అంశాలపై చర్చించారు. అన్ని గ్రామాల్లో పార్టీ కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలని నేతలు సూచించారు. అధికార పార్టీ చేపడుతున్న దౌర్జన్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రజల సమస్యలపై పోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు గ్రామస్థాయిలో మరింత చురుకుగా పనిచేసి ప్రజలకు అండగా నిలవాలని నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి నేతలు, పార్టీ కార్యకర్తలు, అనుబంధ విభాగాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రాదేశిక సభ్యులు ప్రజల అవసరాలకు తగ్గట్టు పాలనందించండి ఎంపీపీ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

బ్రహ్మసముద్రం జనవరి 24 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీడీవో రంగనాయకులు ఆధ్వర్యంలో ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో అధికారులు తాము చేసిన చేయాల్సిన పనుల గురించి చర్చించుకున్నారు ప్రాదేశిక సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ వారు సూచించిన ప్రజల సమస్యలను తీరుస్తామని అధికారులు తెలిపారు. సమాజంలో ఆడపిల్లలు పుట్టడమే నేరంగా తల్లిదండ్రులకు భారంగా సమాజం తయారై ఆడపిల్లలను పురిట్లోనే చంపేస్తున్నారని అన్నారు అనంతరం బాలికల

సమావేశానికి హాజరైన అధికారులు

దినోత్సవం సందర్భంగా కరపత్రాలను విడుదల చేసి బాలికలపై సమాజంలో జరుగుతున్న వివక్షపై ప్రతిజ్ఞచేయించారు అనంతరం జడ్పిటిసి ప్రభావతమ్మ మాట్లాడుతూ మండల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అహర్నిశల పాటుపడుతుందని కళ్యాణదుర్గం శాసనసభ్యులు అమిలినేని సురేంద్రబాబు మండల అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారని బ్రహ్మసముద్రం జీవనాడి అయినా భైరవానితిప్ప ప్రాజెక్టు కాలువ పనులు శరవేగంగా జరుగుతున్నాయని మండల వ్యాప్తంగా ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తున్నారని అన్నారు ఈ కార్యక్రమంలో మండల వ్యాప్తంగా ఉన్న ఉన్నతాధికారులు ప్రాదేశిక సభ్యులు సర్పంచులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు నివాళి అర్పించిన ధర్మ తేజ కన్వీనర్ శ్రీరాములు

బ్రహ్మ సముద్రం జనవరి 24 ప్రభాతవార్త

నివాళులర్పిస్తున్న దృశ్యం

మండల పరిదిలోని ముప్పలకుంట గ్రామానికి చెందిన గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి హనుమంత రాయుడు బ్రెయిన్ స్ట్రోక్ తో మృతి చెందారు విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకుముప్పలకుంట గ్రామానికి యువనేత దేవినేనిధర్మ తేజ కన్వీనర్ పాల బండ్ల శ్రీరాములు వెళ్లి హనుమంత రాయు డు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరమార్శించి ధైర్యంగా ఉండాలని తెలుగుదేశం పార్టీ తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో బిఎస్‌యన్‌ఎల్ టియంసి మెంబర్ రామ్ మోహన్ చౌదరి, మాజీ ఎంపీపీ రామచంద్రప్ప, మాజీ వైస్ ఎంపీపీ చిత్తయ్య, యూనిట్ ఇంచార్జ్ మల్లేష్, హెచ్ ఎర్రి స్వామి, ఆంజనేయులు, బజ్జప్ప, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వైకాపా పంచాయతీరాజ్ జిల్లా ఉపాధ్యక్షుడుగా మధుసూదన్‌రెడ్డి

గుత్తి, జనవరి 24 ప్రభాతవార్త

మధుసూదన్‌రెడ్డి

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనుబంధమైన పంచాయతీరాజ్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా పల్లేటి మధుసూదన్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సంద ర్భంగా ఆయనమాట్లాడుతూ పార్టీ బలోపేతా నికి కృషిచేస్తాననిపేర్కొన్నారు. తన నియామ కానికిసహకరించిన మాజీఎమ్మెల్యే వై.వెంకట రామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సివి రంగారెడ్డి, తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

హిందూపురం టౌన్ జనవరి 24 ప్రభాతవార్త

మృతి చెందిన రత్నమ్మ

హిందూపురం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రత్నమ్మ 50 అనే మహిళ మృతి చెందింది. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి కర్ణాటక రాష్ట్రం గౌరీబిదనూరు తాలూకా దొర్లకుంట గ్రామానికి చెందిన నరసింహప్ప తన భార్య రత్నమ్మతో కలిసి గౌరీబిదనూరు నుండి హిందూపురానికి ఆసుపత్రికి వచ్చారు. అయితే మున్సిపల్ కార్యాలయ సమీపానికి రాగానే వెనుక నుండి ఐచర్ వాహనం ఢీకొనడంతో రత్నమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన భర్త నరసింహప్పను స్థానికులు హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నరసింహ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డ్రైవర్ల సేవలు వెలకట్టలేనివి

హిందూపురం టౌన్ జనవరి 24 ప్రభాతవార్త

డ్రైవర్ల ర్యాలీలో ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీకాంత్

ఆర్టీసీ డ్రైవర్ల సేవలు వెలకట్టలేని వని హిందూపురం డిపో మేనేజర్ శ్రీకాంత్ అన్నారు. శనివారం స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. డిపో మేనేజర్ శ్రీకాంత్ నేతృత్వంలో సుమారు 40 మంది సిబ్బంది గ్యారేజ్ మెయిన్ గేట్ నుండి భారీ ర్యాలీ చేపట్టారు. ప్లే కార్డ్స్, బ్యానర్లతో పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ మీదుగా సాగిన ఈ ర్యాలీలో డ్రైవర్ల సేవలు వర్ధిల్లాలి ఏపీఎస్ఆర్టీసీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడంలో ఏపీఎస్ఆర్టీసీ డ్రైవర్ల సేవలను కొనియాడారు.

ఘనంగా పరిటాల రవి వర్ధంతి

కంబదూరు , జనవరి 24, ప్రభాతవార్త

పరిటాల రవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కంబదూరు మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో దివంగత టీడీపి నేత, మాజీ మంత్రి పరిటాల రవి 21 వ వర్ధంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కరణం రామ్మోహన్ చౌదరి , టీడీపీ నాయకులు పరిటాల రవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన నేతగా ఆయన ప్రత్యేక స్థానం సంపాదించారని రామ్మోహన్ చౌదరి పేర్కొన్నారు. ప్రజా సేవనే ధ్యేయంగా రాజకీయ జీవితాన్ని కొనసాగించిన ఆయన అనేక అభివృద్ధి కార్యక్రమాల ద్వారా అనంతపురం జిల్లా ప్రజల విశ్వాసాన్ని పొందారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వై వి రమేష్ , మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణ, కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్మన్ భర్త సోమశేఖర్ , సీనియర్ నాయకులు తలారి ఎర్రి స్వామి, లింగా సురేంద్ర, కళ్యాణదుర్గం టౌన్ కన్వీనర్ సర్మాష్ వలి, మార్కెట్ యార్డ్ మెంబర్ రాజు,డాబా నాగరాజు, మారుతి, హనుమంత రాయుడు, డిష్ శీన, విజయ్‌కుమార్,డీలర్లసంఘం మండలఅధ్యక్షుడు రఫీ, రవి,యుగం ధర్, తదితర టీడీపి నాయకులు, కార్యకర్తలు ,అభిమానులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించు కోవాలి: తహశీల్దార్ బాలకిషన్

కంబదూరు, జనవరి 24, ప్రభాతవార్త

ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకో వాలని తహశీల్దార్ బాలకి షన్ సూచించారు. జాతీ య ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని కంబదూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం తహశీల్దార్ బాలకిషన్, విద్యార్థులతో కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఓటర్ల దినోత్సవం

బెలుగుప్ప, జనవరి 24 ప్రభాతవార్త

పాఠశాల విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

బెలుగుప్ప మండల కేంద్రంలో కెజిబివి పాఠశాలలో తహశీల్దారు అనిల్‌కుమార్, జిల్లా కార్యదర్శి మల్లికార్జున ఆధ్వర్యంలో కెజిబివి విద్యార్థుల చేత జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ.. విద్యార్థులు ఓటు హక్కు మీ బాధ్యత అని ప్రాధాన్యత వివరించారు. ఓటరు కార్డుకు ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని ఈ కార్యక్రమంలో ఎస్ఓ నాగరత్న బబాయి, ఉపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు.

వైయస్సార్ పార్టీని గ్రామస్థాయి నుండి బలోపేతం చేయడానికే కమిటీలు

తాడిమర్రి పంచాయతీ అబ్జర్వర్ పాటిల్ ప్రకాష్ రెడ్డి, యూత్ కన్వీనర్ మోహన్ రెడ్డి

తాడిమర్రి జనవరి 24 (ప్రభాతవార్త)

సమావేశంలో మాట్లాడుతున్న పాటిల్ ప్రకాష్ రెడ్డి

గ్రామస్థాయి నుండి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేం దుకు ప్రతి ఒక్క కార్యకర్త నడుం బిగించి పోరాడా లని తాడిమర్రి పంచాయతీ అబ్జర్వ ర్ పాటిల్ ప్రకాశ్ రెడ్డిపిలుపునిచ్చారు. శనివారంమండల పరిధిలోని మోదుగులకుంట (తిరుమలాపురం) గ్రామంలోగ్రామ కమిటీ ఏర్పాటు కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అబ్జర్వర్ పాటిల్ ప్రకాశ్ రెడ్డి, మండల యూత్ కన్వీనర్ మోహన్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుండి బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ప్రతి పంచాయతీ నుండి సుమారు 42 మంది క్రియాశీలక సభ్యులను కమిటీ లోకి ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు. ఎంపిక చేయబడిన సభ్యులకు గుర్తింపు కార్డు మంజూరు చేసి వారికి పార్టీలో తగిన గుర్తింపు గౌరవం ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నిక ఈ కార్యక్రమంలో సచివాలయం మాజీ కన్వీనర్ అల్లే సాయినాథ్ రెడ్డి,సిద్దే రామకృష్ణా రెడ్డి, మారక నారాయణస్వామి, తాడిమర్రి శంకర్ రెడ్డి, పామాల కాటమయ్య, బాలాజీ, చెన్నకేశవులు, మారక శంకర్ రెడ్డి, సిద్దే మల్లికార్జున రెడ్డి, మారక శ్రీరామ్ రెడ్డి, బోజ్జి రెడ్డి, చిలకల నారాయణరెడ్డి, మారక పరమేశ్వర్ రెడ్డి, సిద్దే సుధాకర్ రెడ్డి, మారక వాసుదేవరెడ్డి వైసీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

పరిటాలరవి హస్తమించిన ఆయన పేరు ప్రజల్లో చిరస్థాయిగా నిలిచింది

నివాళులర్పించిన మంత్రి సవిత భర్త వెంకటేశ్వరరావు

పెనుకొండ జనవరి 24 (ప్రభాతవార్త)

పరిటాల రవీంద్ర విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి సవిత భర్త టిడిపి శ్రేణులు

పరిటాల రవీంద్ర అస్తమించిన ఆయన కీర్తి ప్రజ ల్లో శిరస్థాయిగా నిలిచిందని తెదే పా నాయకులు మంత్రి సవిత భర్త వెంకటేశ్వర రావు తెలిపారు. పరిటాల రవీంద్ర 21 వ వర్ధంతి సందర్భం గా పెనుకొండ పట్టణంలోని పరిటాల రవీంద్ర విగ్రహానికి మంత్రి సవిత భర్త వెంకటేశ్వరరావు టిడిపి శ్రేణులతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పరిటాల రవీంద్ర పేరే ఓసంచలనమని పేద ప్రజలపక్షాననిలిచి అలుపెరగని పోరాటాలు ఎన్నో చేశాడని ఆపోరాటాలలో ఆయన తండ్రి పరిటాల శ్రీరాములు చిన్నాన్నలతో పాటు,సోదరుడు పరిటాల హరి ప్రాణాలర్పించారని,చివరికి తన ప్రాణాలు సైతం అర్పించారని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు,బ్రెడ్లు పంపిణీ చేశారు, వైద్యులు ప్రత్యక్ష దైవాలు అని,మీకు ఏ ఇబ్బంది వచ్చిన తన దృష్టికి తెస్తే ఆ విషయాన్ని వెంటనే మంత్రి సవితకు తెలిపి మీసమస్యలు తీరుస్తాం అనిహామీఇచ్చారు. ఈసందర్భంగా విలేఖరుల తో మాట్లాడుతూ పరిటాల రవీంద్ర అలుపు ఎరుగని పోరాటయోధుడని టిడిపి కార్యకర్తల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి ఉన్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, టిడిపి నాయకులు మాధవ నాయుడు,మండల కన్వీనర్లు వెంకటేశులు,బాలకృష్ణ చౌదరి,ఈశ్వర్ ప్రసాద్,మాజీ జెడ్పిటిసి నారాయణస్వామి, సింగల్ విండో చైర్ పర్సన్ పోతిరెడ్డి, సోమందపల్లి నీరుగంటి చంద్ర, అర్బన్ టిడిపి కన్వీనర్ శ్రీరాములు, మాజీ సర్పంచ్ అశ్వర్థనారాయణ,టిడిపి నాయకులు త్రివేంద్ర,బాబుల్ రెడ్డి,కురుబవాండ్లపల్లి మాజీ సర్పంచ్ సోమశేఖర్,మాజీ సింగల్ విండో అధ్యక్షులు లక్ష్మీనారాయణరెడ్డి,పట్టణ టిడిపి మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, సాయి ప్రసాద్ , సుబ్రహ్మణ్యం,ప్రభంజన్ స్వామి, బండలనూర్,రఘువీర చౌదరి, పులగూర శ్రీనివాసులు, గోరంట్ల మండల నాయకులు జిల్లా టిడిపి కార్యదర్శి నరేష్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రవి నాయక్,అచ్యుత్‌చౌదరి, ప్రతాప్‌నాయుడు,ప్రకాష్,కురుబ మహేంద్ర,సుభాష్ , శ్రీశైలం శ్రీనివాసులు,బిజెపి నాయకులు రామకృష్ణ, రామాంజనేయులు, నాయకులు, కార్యకర్తలు, పరిటాల అభిమానులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

బెలుగుప్ప, జనవరి 24 ప్రభాతవార్త

ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

బెలుగుప్ప మండల పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం బ్యాల వివాహాల నిర్మూలనకు 100 రోజులు జాతీయ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ఉషారాణి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. బాల్యవివాహాల వల్ల జరిగేనష్టాలు, బాలికల హక్కులు, భవవిష్యత్తులో తమ లక్ష్యాలనుసాధించడానికి విద్య ప్రాముఖ్యత గురించి వివరించారు. బాల్య వివాహాల నిర్మూలన హెల్ప్‌లైన్ 1098లో సమాచారం ఇవ్వాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కళావతి, అనిత, లక్ష్మిదేవి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివంగత నేత మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 21వ వర్ధంతి సందర్భంగా రామగిరి మండలం వెంకటాపురం గ్రామంలో వర్ధంతి కార్యక్రమ దృశ్యాలు..

పెయ్యాల ఇంట...తేనీటి విందులో మాజీ డిజిపి

- ఆనాటి మిత్రుడు రామలింగారెడ్డిని కలిసిన మాజీ డిజిపి అరవింద్‌రావు

గోరంట్ల, జనవరి 24 ప్రభాతవార్త

అరవింద్‌రావును ఆహ్వానిస్తున్న పెయ్యాల ఫ్యామిలీ

మండలంలోని నార్సింపల్లి గ్రామానికి చెందిన రాజకీయ సీనియర్ నాయకులు పెయ్యాల రామలింగారెడ్డి కుటుంబాన్ని శనివారం రాష్ట్ర మాజీ డిజిపి అరవింద్‌రావు సందర్శించారు. మాజీ డిజిపి అరవింద్‌రావు, రామలింగారెడ్డిలు బాల్యంలో మంచి మిత్రులుగా ఉన్న నేపథ్యంలో ఆ జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ రామలింగారెడ్డి కుటుంబసభ్యులతో ఆయన ఉల్లాసంగా గడిపారు. అరవింద్‌రావు వచ్చిన నేపథ్యంలో ఆ కుటుంబ సభ్యులు మాజీ సర్పంచు పెయ్యాల శివారెడ్డి, హరినాథ్‌రెడ్డి, తదితరులు అరవింద్‌రావుకు ఘన స్వాగతం పలికారు.

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా సీఎంఆర్ఎఫ్ సాయం

-చెక్కుల పంపిణీలో టీడీపీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు -34 మంది లబ్దిదారులకు రూ.19.59 లక్షలు విలువైన చెక్కులు పంపిణీ

ఉరవకొండ, జనవరి 24 ప్రభాతవార్త

సీఎంఆర్ఎఫ్ చెక్కును అందిస్తున్న టీడీపీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు

చెక్కులందుకున్న వారితో టీడీపీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు

పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ సాయం ఆర్థిక భరోసాను అందిస్తోందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు అన్నారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవతో నియోజక వర్గంలోని ఐదు మండలా లకు చెందిన 34 మంది లబ్దిదారులకు మంజూరైన 19,59,999 రూపాయలు సీఎంఆర్ఎఫ్ సాయానికి సంబంధించిన చెక్కులను శనివారం ఆయన జిల్లా కేంద్రం అనంతపురం రామ్‌నగర్‌లోని స్వగృహంలో పంపిణీ చేశారు. ఉరవకొండ పట్టణానికి చెందిన ఆరుగురు, రూరల్ మండలంలోని 10 మంది, బెలుగుప్ప మండలానికి చెందిన ఐదుగురు, కూడేరు మండలానికి చెందిన ఐదుగురు, వజ్రకరూరు మండలానికి చెందిన ఐదుగురు, విడపనకల్లు మండలానికి చెందిన ముగ్గురు లబ్దిదారులు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న వారిలో ఉన్నారు. చెక్కులందుకున్నవారు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై స్వచ్ఛాంధ్ర ర్యాలీ

లేపాక్షి, జనవరి 24 ప్రభాతవార్త

తహశీల్దార్ కార్యాలయం పరిసరాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

మండల కేంద్రమైన లేపాక్షిలో తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపిడిఒ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాల పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత ముఖ్యమన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మనం ఆరోగ్యంగా ఉంటామన్నారు. అంతేకాకుండా దోమలు వృద్ధి చెందవన్నారు. మలేరియా వంటి జ్వరాలకు అడ్డుకట్ట వేయవచ్చని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కుమార్‌స్వామిరెడ్డి, ఎంపిడిఒ కార్యాలయం సిబ్బంది, పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

గుత్తి, జనవరి 24 ప్రభాతవార్త

రక్తదానం చేసిన దృశ్యం

సమాజ సేవలో భాగంగా యువత రక్తదానం చేసి ఇతరులకు ప్రాణదాతలు కావాలని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక కళాశాలలో శనివారం కళాశాల వ్యవస్థాపకులు వికే సుధీర్‌రెడ్డి 80వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాలలో మానవతా విలువలకు ప్రతీకగా రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు 70 మంది విద్యార్థులు, సిబ్బంది, రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ వికె పద్మావతి, డైరెక్టర్ శ్రీవాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ నమ్రత, ఏఒ ఇంతియాజ్‌బాషా, గుత్తి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పరమేశ్వర్‌రెడ్డి, అనంతపురం ప్రభుత్వాసుపత్రి డాక్టర్లు మోతి, రవి, సూపర్‌వైజర్ మురళీమోహన్, తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు న్యాయమైన ధరలు కల్పించాలి - సిపిఐ డిమాండ్

చిలమత్తూరు, జనవరి 24 ప్రభాతవార్త

వినతిపత్రం అందచేస్తున్న రైతు సంఘం నాయకులు

పాల ఉత్పత్తిదారులకు న్యాయమైన ధరలు కల్పించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో శనివారం జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి గోవిందరెడ్డి, జిల్లా రైతు సంఘం నాయకుడు కె.వి చలపతిలు తహశీల్దార్ మనోజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డైరీల పాల ప్యాకెట్లను అధిక ధరలకు అమ్ముతున్నారని, అదే గ్రామాలలో పాలఉత్పత్తి దారుల నుండి తక్కువ ధరకే పాలు కొనుగోలు చేస్తున్నారని, పాడినే నమ్ముకున్న రైతులు మండల వ్యాప్తంగా నిరాశతో ఉన్నారన్నారు, అలాగే పశువుల దాణ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని వాపోయారు. వెంటనే మండలంలోని డైరీ యాజమాన్యాలకు విషయం తెలియజేసి పాల ఉత్పత్తిదారులకు పాల ధరలు పెంచే విధంగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంపై తహశీల్దార్ స్పందిస్తూ ఉన్నతాధికారులకు విషయం తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వెంకటేశులు, ఆదినారాయణ, జయచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీలే వైయస్సార్సీపీకి పునాది!

గ్రామ కమిటీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

రాప్తాడు, జనవరి 24 ప్రభాతవార్త

రాప్తాడు మండల వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పార్టీ సంస్థాగత కమిటీని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ గ్రామ కమిటీ ఏర్పాటు చేస్తున్నాం అనిఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి సత్యనారాయణ రెడ్డి, మండల కన్వీనర్ సాకే వెంకటేష్, యూత్ కన్వీనర్ విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో వైఎస్ఆర్సిపి గ్రామ కమిటీలు రైతు విభాగం, విద్యార్థి విభాగం, యువజన విభాగం, సోషల్ మీడియా బీసీ విభాగాలు నియమిస్తున్నామన్నారు, అదే విధంగా గ్రామ స్థాయిలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే పార్టీ ముఖ్య అజెండా అని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో జగనన్న 2.0 ద్వారా కార్యకర్తలకు అత్యంత గౌరవంతో కూడిన పరిపాలన కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నడూ లేని విధంగా దారుణ పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. భారతదేశంలో వంద సంవత్సరాల బ్రిటిష్ పాలన తర్వాత ల్యాండ్ టైటిలింగ్ విధానాన్ని ప్రవేశపెట్టిన ఘనత వైయస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు చింతకాయల జయన్న, పిట్టి రామాంజి, శ్రీధర్, బొమ్మెపర్తి నరసింహారెడ్డి, సింగారప్ప తదితరులు పాల్గొన్నారు.

సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో అనంత విద్యార్థుల ప్రభంజనం

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, జనవరి 24 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా నుంచి సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ కు నాలుగు ప్రాజెక్టులు పోటీల్లో పాల్గొనగా...100 శాతం విజయాన్ని నమోదు చేయడం జరిగింది. హైదరాబాద్ గాడియం ఇంటర్నేషనల్ స్కూల్, కొల్లూరులో జరిగిన సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ పోటీలలో గ్రూప్ కేటగిరీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హనకనహాల్ కణేకల్ మండలం చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థులు బి.ప్రవళ్మిక, పి.నవాజ్‌లు పాఠశాల స్థాయిలో వ్యర్థ కాగితాలు, ప్లాస్టిక్ బహుళార్థక నిర్వహణ అనే అంశం మీద ప్రథమ స్థానంలో నిలిచింది. వీరికి మార్గదర్శక ఉపాధ్యాయులుగా జీవశాస్త్ర ఉపాధ్యాయులు మేడాప్రసాద్ వ్యవహరించారు. ఉపాధ్యాయ కేటగిరీలో ఉరవకొండ ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన గణితశాస్త్ర ఉపాధ్యాయులు ఏ.చంద్రశేఖర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభాగంలో టచ్, ఎంజాయ్ అండ్ లెర్న్ మ్యాథ్స్ అనే అంశంతో ప్రథమ స్థానంలో నిలిచారు. విద్యార్థి వ్యక్తిగత విభాగంలో యస్.కోనాపురంకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థి సాత్విక్ ప్రదర్శించిన గడ్డి కత్తిరించే యంత్రం అనే అంశంతో స్పెషల్ జ్యూరీ అవార్డు లభించింది. దీనికి జీవశాస్త్ర ఉపాధ్యాయులు హరికృష్ణ మార్గదర్శక ఉపాధ్యాయులు వ్యవహరించారు. వ్యక్తిగత విభాగంలో యాడికి మండలం కోనుప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సుహాసిని ప్రదర్శించిన ఇంటెలిజెంట్ స్మార్ట్ గ్లాసెస్ అనే అంశానికి కూడా ప్రత్యేక జ్యూరీ లభించింది. ఈ ప్రాజెక్టుకు భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు కృపావతి మార్గ దర్శక ఉపాధ్యాయలుగా వ్యవహరించారు. విజేతలను జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాద్‌బాబు, సమగ్ర తిశిది శైలజ, నరసింహ రెడ్డి, సైన్స్ సెంటర్ క్యురేటర్ బాలమురళి కృష్ణ అభినందించారు.

హాస్టల్ విద్యార్థులపై ఫీజు భారం తగ్గించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్

నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం న్యూటౌన్, జనవరి 24 ప్రభాతవార్త

కెఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో హాస్టల్ నిర్వహణ కోసం టెండర్లు ఆహ్వానించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కేఎస్ఎన్ డిగ్రీ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతురు పరమేష్ అధ్యక్షులు గిరి మాట్లాడుతూ.. అనంతపురం నగరంలో ఉన్న మహిళా డిగ్రీ కళాశాల కేఎస్ఎన్ 9 సంవత్సరాల నుంచి ఒకే కాంట్రాక్టర్ హాస్టల్ నిర్వాహణ చేయడంపై విద్యార్థులపై అధిక ఫీజులు భారాలు పడుతున్నాయని, విద్యార్థులపై ఫీజులు బారాలు తగ్గించాలని కోరారు. ఒక విద్యార్థి నుంచి ఒక సంవత్సరానికి 25000 వేల రూపాయలు హాస్టల్ నిర్వహణ కోసం కళాశాల ప్రిన్సిపల్ వసూలు చేస్తున్నారు కానీ.. విద్యార్థులు సంవత్సరంలో 8 నెలలు మాత్రమే కళాశాల అనుబంధం ఉన్న హాస్టల్లో ఉంటున్నారన్నారు. ఒక విద్యార్థికి ఒక నెలకు 3100 వరకు ప్రభుత్వ హాస్టల్లో వసూలు చేయడం అంటే అవినీతికి పునాది వేయడం కాదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి శివ, నగరు ఉపాధ్యక్షులు వంశి,సాయి, ఓం నాథ్, గణేష్, నిఖిల్, సంతోష్ కుమార్, మనోజ్, నరసింహ, చక్రధర్, సంతోష్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ఆరోగ్య రక్షణకు టి టి సూదులు వేయిస్తున్నాం

- ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి.

అనంతపురం రూరల్, జనవరి 24 ప్రభాతవార్త :

కార్మికులకు టిటి సూదులు వేస్తున్న దృశ్యం.

పంచాయతీ కార్మికుల ఆరోగ్య రక్షణకు కార్మికులందరికీ టిటి సూదులు వేయించడం జరుగుతుందని ఎంపీడీవో దివాకర్, డిప్యూటీ ఎంపీడీవో వెంకట నాయుడు, గ్రేడ్ 2 పంచాయతీ కార్యదర్శి సర్దార్ వలి తెలిపారు. శనివారం రాచనపల్లి పంచాయతీలోని పంచాయతీకార్మికులకు టిటి సూదులు వేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతరూరల్ మండలంల్లోని పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల ఆరోగ్య రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం వారికి టిటి సూదులు వేసే కార్యక్రమం ఏర్పాటు చేసిందని అందులో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో కార్మికులకు టిటి సూదులు వేయించడం జరుగుతుందన్నారు. ఈ సూదులను పంచాయతీ కార్మికులు అందరూ తప్పకుండా వేయించుకోవాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పేదలపాలిట పెన్నిధి పరిటాల రవీంద్ర

- శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణశ్రీ

పరిటాల రవి ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, జనవరి 24 ప్రభాతవార్త

బడుగు బలహీన వర్గాలకు, పేదల పాలిట పెన్నిధి, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర అని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. శనివారం మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 21వ వర్ధంతి సందర్భంగా వెంకటాపురంలోని పరిటాల రవి ఘాట్‌కి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆమె వెంట టిడిపి సీనియర్ నాయకులు బండారు లీలావతి, శింగనమల మార్కెట్‌యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు, టిడిపి మండల కన్వీనర్ మారుతినాయుడు, సింగిల్ విండో అధ్యక్షులు గుర్రంలక్ష్మినారాయణ, జిసి బాబు, టిఎన్ఎస్ఎఫ్ బండి పరుశురామ్ తదితరులు ఉన్నారు. అనంతరం రాప్తాడు ఎమ్మెల్యేక పరిటాల సునీతను, ధర్మవరం టిడిపి ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు.

వ్యాలీ గ్రీన్ గార్మెంట్ పరిశ్రమను సందర్శించిన డిఆర్డిఏ పిడి శైలజ

గ్రీన్ వ్యాలీ గార్మెంట్‌ను సందర్శిస్తున్న డిఆర్డిఏ పిడి శైలజా

అనంతపురం, జనవరి 24 ప్రభాతవార్త బ్యూరో

మహిళల అభ్యున్నతికి తోడ్పడడం పై ఆర్థం వ్యక్తం చేసిన శైలజ శనివారం అనంతపురం జిల్లా పామిడి మండలం గజరాంపల్లి గ్రామంలోని వ్యాలీ గ్రీన్ గార్మెంట్ పరిశ్రమను శనివారం డిఆర్డిఏ పిడి శైలజ, బృందం సందర్శించారు. అనంతరం గార్మెంట్ పరిశ్రమను సందర్శించి పరిశ్రమలలో ఉన్నటువంటి ఫ్యాబ్రిక్ సెక్షన్, కటింగ్ సెక్షన్, ప్రొడక్షన్ సెక్షన్, ప్యాకింగ్ సెక్షన్, స్టోర్, క్యాంటీన్, లను సందర్శించిన అనంతరం శైలజ మాట్లాడుతూ.. కరువు జిల్లా అనంతపురం జిల్లాలో మారుమూల ప్రాంతంలో చుట్టుపక్కల గ్రామాలలో ఉన్నటువంటి మహిళల కోసం వ్యాలీ గ్రీన్ గార్మెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయడం చాలా సంతోషకరంగా ఉందని వ్యాలీ గ్రీన్ గార్మెంట్ పరిశ్రమ ఎండి పెరుమాళ్ళ మమతారెడ్డి, పెరుమాళ్ళ జీవానంద రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతపురం జిల్లాలో ఇటువంటి పెద్ద పరిశ్రమ పెట్టడం ఎంతో కష్టమని ఈ పరిశ్రమను ఏర్పాటుచేసి 5000 మంది మహిళలకు ట్రైనింగ్ ఇవ్వడం 1000 మహిళలకు జీవన ఉపాధి కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాలీ గ్రీన్ గార్మెంట్ అధినేత పెరుమాళ్ళ జీవానంద రెడ్డి, సీఈఓ తిమ్మారెడ్డి, డిఆర్డిఏ పిడి శైలజ, ఏపిఎం శివప్రసాద్,శివయ్య, పామిడి ఏపీఎం నల్లప్ప ప్రొడక్షన్ మేనేజర్ హరీష్, పాలాక్షి రెడ్డి, రామంజి,, అశోక్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వివక్షతకు తావులేని సమాజం విద్యతోనే సాధ్యం

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ పి.ప్రసూన

అనంతపురం, జనవరి 24 ప్రభాతవార్త బ్యూరో

మహిళలు, ఆడపిల్లల పట్ల వివక్షత లేని సమాజ నిర్మాణం విద్యతోనే సాధ్యమవుతుందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ పి.ప్రసూన తెలియజేశారు. సమత నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా నగరంలోని శారద, కెఎస్ఆర్, కురుగుంట బాలికల రెసిడెన్షియల్ హైస్కూళ్లలో కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. బాలికలు ఆరోగ్యపరంగా, సామాజిక పరంగా ఎదిగెందుకు విద్య ఎంతో ఉపయోగపడుతుందని, వివక్షత లేని సమాజ నిర్మాణం కూడా దానితోనే సాధ్యమవుతుందని ఆమె అన్నారు. 1966లో ప్రధానమంత్రిగా ఇందిరా గాంధీ అధికారంలోకి వచ్చిన రోజు జనవరి 24న జాతీయ బాలిక దినోత్సవంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ బాలిక దినోత్సవంను 2008 నుండి నిర్వహించడం జరుగుతుందని అన్నారు. భవిష్యత్తులో మీరు కూడా అలా రాణించాలని దానికి కృషి, పట్టుదలతో పాటు శాస్త్రీయపరమైన ఆలోచన కూడా తోడవ్వాలని అప్పుడు మాత్రమే మనం అనుకున్నది సాధించగలుగుతామని ఈ సందర్భంగా ఆమె తెలియజేశారు. దేశంలో నెలకొని ఉన్న అశాస్త్రీయ భావజాలాన్ని రూపుమాపుటకు మీరంతా కూడా సిద్ధమవ్వాలని ఆ రకమైన ఎదుగుదల మీలో కనిపించాలని ఆమె విద్యార్థులకు సూచించారు కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు సమతా నాయకులు లక్ష్మి, కె.నాగరత్న జెవివి నగర కార్యదర్శి సాకే తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా కార్యవర్గ కార్యదర్శిగా బయపరెడ్డి

బుక్కరాయసముద్రం జనవరి 24 ప్రభాతవార్త

వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంతవెంకట రామిరెడ్డి, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డి, శింగనమల నియోజక వర్గం సమన్వయకర్త మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్ సూచనల మేరకు బుక్కరాయ సముద్రం మండలం పసులూరు గ్రామానికి చెందిన బయపరెడ్డిని వైసీపీ జిల్లా కార్యవర్గ కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర వైసీపీ కార్యాలయం నుండి ఉత్తర్వులు అందించారు.ఈ సందర్భంగ బయపరెడ్డి మాట్లడుతూ నామీద నమ్మకంతో పార్టీలో నాకు ఇంత పెద్ద పదవి నాకు కేటాయించినందుకు ఆలూరు సాంబశివారెడ్డి,అనంతవెంకటరామిరెడ్డి,సాకే శైలజనాథ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ పార్టీ బలోపేతానికి కృషిచేస్తామన్నారు.

గురుకుల పాఠశాలలో ఖాళీ సీట్ల భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం న్యూటౌన్, జనవరి 24 ప్రభాతవార్త

సాంఘిక సంక్షేమ గురుకులలో (డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం) అనంతపురము, సత్యసాయి జిల్లాలలోని 16 అంబేద్కర్ గురుకులాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, 6-9వ తరగతి వరకు ఖాళీ వున్న సీట్లకోసం విద్యార్థుల నుంచి దరకాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లాల జిల్లా సమన్వయ అధికారి కె.జయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విధ్యార్థులు జనవరి 20, 2026 నుండి ఫిబ్రవరి 19, 2026 తేదీ లోపల 100 రూపాయల దరకస్తు రుసుముతో ఎక్కడైన వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకోగలరని ప్రవేశం ఎస్సీ1 వారికి 5, ఎస్సీ 2 వారికి 32.5, ఎస్సె3 వారికి 37.5, ఎసి 6, బీసీ సి 11, బిసి 5, ఓసీ వారికి 3 ప్రకారం సీట్లు హెడ్ ఆఫీస్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారని, ప్రస్తుతానికి ఉమ్మడి అనంతపురం జిల్లాలో అమ్మాయిలకు ఖాళీ లు లేవు, అబ్బాయిలకు రోళ్ళ స్కూల్‌లో మాత్రమే 10వ తరగతికి ఎస్సీ 3 16, ఎ2, ఓసీ2 మాత్రమే వున్నాయని అందులో తెలిజేశారు.

ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ నాగేంద్ర కుమార్ పిలుపు

- 4 లేబర్ కోడ్లు కార్మికవర్గం మెడకి ఉరి తాళ్లు

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం కలెక్టరేట్ జనవరి 24 ప్రభాతవార్త

గనే నాయక్ భవనం నందు శనివారం సిఐటియు అనంతపురం జిల్లా విస్తృత స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షులు ఆర్.వి. నాయుడు అధ్యక్షతన జరిగింది. జిల్లా వ్యాప్తంగా వివిధ రంగాల ప్రధాన నాయకత్వం, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లుగా కుదించడం ద్వారా కార్మిక వర్గం ఎన్నో దశాబ్దాల పోరాటాలతో సాధించుకున్న హక్కులను హరించిందన్నారు. ఈ కోడ్లు కార్మిక సంస్కరణల పేరిట తీసుకొచ్చినా, వాస్తవానికి కార్పొరేట్ యాజమాన్యాల ప్రయోజనాల కోసం రూపొందించ బడినవేనని విమర్శించారు. పారిశ్రామిక సంబంధాల కోడ్ ప్రకారం 300 మంది వరకు ఉద్యోగులు ఉన్న సంస్థల్లో తొలగింపులకు ప్రభుత్వ అనుమతి అవసరం లేకపోవడం, ఫ్యాక్టరీల మూసివేతకు అడ్డంకులు లేకపోవడం హైర్ అండ్ ఫైర్ విధానానికి చట్టబద్ధత కల్పించడమేనన్నారు. ప్రశ్నించే కార్మికుల గొంతుకను నొక్కేయాలనే కుట్ర ఈ కోడ్లలో దాగి ఉందన్నారు. మూడు రైతు చట్టాలను పోరాటంతో రద్దు చేయించినట్లే, కార్మిక వర్గం ఐక్యంగా పోరాడితే లేబర్ కోడ్లను కూడా అడ్డుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం నాగమణి ,గోపాల్ మన్నిలరామాంజనేయులు,ముత్తుజ ,శకుంతల ,రమాదేవి, ఏటీఎం నాగరాజ్ రమేష్ ,నరసింహారెడ్డి ,ఉమా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరిటాల రవి 21వ వర్ధంతి

నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

నార్పల జనవరి 24, ప్రభాతవార్త

దివంగత మాజీ మంత్రివర్యులు, పెనుకొండ మాజీ ఎమ్మెల్యే పరిటాల రవీంద్ర గారి 21వ వర్ధంతి సందర్భంగా వెంకటాపురంలోని పరిటాల రవి ఘాట్ వద్ద ఆయన సమాధికి,ఎమ్మెల్యే బండారు శ్రావణి, టీడీపీ సీనియర్ నాయకురాలు బండారు లీలావతి తో కలిసి పూల మాల వేసి నివాళులు అర్పించిన నార్పల మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ఆకుల విజయ్ కుమార్ (బాబు) గారు. ఈ సందర్భంగా ఆకుల బాబు మాట్లాడుతూ పరిటాల రవి అన్న బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతి అన్నారు. ఆయన కీర్తి శిఖరాలు పేరు ప్రఖ్యాతలు సూర్యచంద్రులున్నంతకాలం అమరంగా ఉంటాయని తెలియజేశారు.

మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు కుటుంబాన్ని పరామర్శించిన ఆలూరు సాంబశివారెడ్డి

పరామర్శిస్తున్న ఆలూరు సాంబశివరెడ్డి

నార్పల జనవరి 24, ప్రభాతవార్త

నార్పల మండలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు లోకనాథ్ రెడ్డి తండ్రి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు నడిపి తిమ్మారెడ్డి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతి చెందడానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మృతుని పవిత్రాత్మకు శాంతి చేకూరాలని దేవుణ్ణి ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం పార్లమెంట్ కార్యదర్శి నిట్టూరు రఘునాథ్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మిద్దెకుల్లాయప్ప, పప్పూరు ఎంపీటీసీ పద్మాకర్ రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు మెరుసు రమణారెడ్డి, కేశవ, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా సాగుతున్న రంజి మ్యాచ్

- ఆంధ్ర టార్గెట్ 259

ఆంధ్ర-విదర్భా జట్ల మధ్య జరుగుతున్న రంజి మ్యాచ్

అనంతపురం సిటీ, జనవరి 24 ప్రభాతవార్త

ఆర్డిటి క్రీడా మైదానం వేదికగా ఆంధ్ర-విదర్భా మధ్య జరుగుతున్న బిసిసిఐ రంజి ట్రోఫీ మ్యాచ్ ఆసక్తి కరంగా సాగుతోంది. 3వ రోజు విదర్భా జట్టు రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభ్జించి 191 పరుగులకు ఆల్‌ఔట్ అయింది. అనంతరం 259 పరుగులలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన ఆంధ్రజట్టు ఒక వికెట్ కోల్పోయి 93 పరుగులను సాధించింది. విదర్భా జట్టులో ముకడే 51 పరుగులు, సామ్రాత్ 47 పరుగులు, వైవి రాథోడ్ 56 పరుగులు సాధించారు. ఆంధ్రబౌలర్లు సాయితేజా 4 వికెట్లు సాధించగా, సౌరత్‌కుమార్, నితీష్‌కుమార్‌రెడ్డి చెరో రెండు వికెట్లు సాధించారు. ఆంధ్రబ్యాటింగ్‌లో షేక్ రసీద్ 65 బంతుల్లో 8 ఫోర్లతో 50 పరుగులు సాధించారు. కెఎస్ భరత్ 27 పరుగులు, అభిషేక్‌రెడ్డి 11 పరుగులు సాధించారు. 3వ రోజు మ్యాచ్‌లో ఇండియన్ సెలక్టర్ ప్రజ్ఞాన్ ఓజా, ఏసిఎ సెలక్షన్ కమిటీ ఆర్‌విసిహెచ్ ప్రసాద్ పర్యవేక్షించారు.

వైసిపి మండల కన్వీనర్‌గా ఆలమూరు పరందామరెడ్డి

శింగనమల, జనవరి 24 ప్రభాతవార్త

మండల పరిధిలోని ఉల్లికల్లు గ్రామానికి చెందిన ఆలమూరు పరందామరెడ్డిని వైఎస్ఆర్‌సిపి మండల కన్వీనర్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తనకు మండల కన్వీనర్‌గా అవకాశం కల్పించిన మాజీ మంత్రి, నియోజకవర్గసమన్వయ కర్త డా.సాకే శైలజానాథ్‌కు, పార్టీ అదిష్టానానికి, నియోజకవర్గ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోనికార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు.

పరిటాలరవీంద్రకినివాళులర్పించిన కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకులు

అనంతపురం రూరల్, జనవరి 24 ప్రభాతవార్త

పరిటాల రవీంద్ర వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీతను, పరిటాల శ్రీరామ్ కలిసిన టిడిపి నాయకులు

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, పేద ప్రజల సంక్షేమం, ఆడబిడ్డల మాన ప్రాణ సంరక్షణ కోసం నిలబడి తన ప్రాణాలను సైతం ప్రజల కోసం, తెలుగుదేశం పార్టీ కోసం అంకితం చేసి, శత్రువులకు వెన్ను చూపకుండా వారి తూటాలకు బలైన మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 21వ వర్ధంతి సందర్భంగా వెంకటాపురం గ్రామంలో పరిటాల ఘాట్ వద్ద పూల మాలలు వేసి ఘన నివాళి అర్పించిన మండల కన్వీనర్, జింక సూర్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సర్దార్ నప్ప, టీడీపీ సీనియర్, నాయకులు అక్కులప్ప (బుజ్జయ్య) బండి ఈశ్వరయ్య, అల్లీపీరా, ఆంజనేయులు, మల్లికార్జున, రామాంజనేయులు, డీలర్ కుల్లాయప్ప, రాజేష్, శివ, రాచా న పల్లిపంచాయతీలోని కార్యకర్తలు అనంతరం రాప్తాడు శాసన సభ్యురాలు పరిటాల సునీతమ్మ, ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పరిటాల శ్రీరాములను వారు కలిశారు.

బడుగు బలహీన వర్గాల కోసం పాటుపడిన వ్యక్తి పరిటాల రవీంద్ర

- సిండికేట్ నగర్ టిడిపి నాయకులు.

అనంతపురం రూరల్, జనవరి 24 ప్రభాతవార్త

పరిటాల రవీంద్ర వర్ధంతి సందర్భంగా ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడి తన ప్రాణాలను సైతం ప్రజల కోసం, తెలుగుదేశం పార్టీ కోసం శత్రువులకు వెన్ను చూపకుండా వారి తూటాలకు బలైన వ్యక్తి మాజీ మంత్రి పరిటాల రవీంద్ర అని రాచనపల్లి పంచాయతీ సిండికేట్ నగర్ టిడిపి నాయకులు కార్యకర్తలు పేర్కొన్నారు. పరిటాల రవీంద్ర 21వ వర్ధంతి సందర్భంగా వెంకటాపురం గ్రామంలో పరిటాల ఘాట్ వద్ద పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించిన రాచా న పల్లిపంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్షులు మంజునాథ్, సిండికేట్ నగర్ టీడీపీ నాయకులు నాగరాజు, ఎర్రి స్వామి, వీరేష్, మెటికలు రామకృష్ణ,రామాంజనేయులు, వెంకట రాముడు, మల్ రాయుడు, రమేష్, కార్యకర్తలు అనంతరం రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీతమ్మ, ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పరిటాల శ్రీరాములను వారు కలిశారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం

సంపూర్ణ పారిశుద్ధ్యంపై అవగాహణ కల్పిస్తున్న ఎంపిడిఓ తేజోష్ణ

పామిడి జనవరి 24 ప్రభాతవార్త

పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతారని ఎంపిడిఓ తేజోష్ణ పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామపంచాయతీల్లో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ర్యాలీలను చేపట్టి సంపూర్ణ పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. ఈమేరకు పామిడి మేజర్ పంచాయతీలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఎంపిడిఓ తేజోష్ణ మాట్లాడుతూ పరిశుభ్రతను పెంపొందించి పర్యావరణాన్ని పరిరక్షించటమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ పరిసరాల పరిశుభ్రత ప్రతిపౌరుడి బాధ్యత అన్నారు. పరిశుభ్రతను పెంపొందించటానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని చేపడుతోందని అందువల్ల పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతగా భావించి స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో బాగసాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం బహిరంగ మలమూత్ర విసర్జన అనేక అనర్థాలకు దారితీసుందని, ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, మరుగుద

కూటమి ప్రభుత్వంతోనే పట్టణాభివృద్ధి - ఎమ్మెల్యే కాలవ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలువ

రాయదుర్గం జనవరి 24 ప్రభాతవార్త

రాయదుర్గం పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజల అవసరాలు తీర్చడానికి కూటమి ప్రభుత్వం తోనే సాధ్యమని శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. పట్టణంలోని 8వవార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాయదుర్గం పట్టణంలోని ఎనిమిది, పదవ వార్డ పరిధిలో గడచిన ఆరు నెలల కాలంలో రూ.1.20కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ రెండు వార్డుల పరిధిలోని రెండు సిమెంట్ కాంక్రీట్ రహదారుల ఏర్పాటుకు రూ.27 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. అంతర్గత రోడ్డుతో పాటు మురికి కాలువలు లేని ప్రాంతాలకు తొలి ప్రధాన్యత ఇస్తున్నామన్నారు. తొలి విడతగా రాయదుర్గం పట్టణంలో రూ.మూడు కోట్ల విలువైన పనులతో వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు.15 ఆర్థిక సంఘం నిధులతో కార్యక్రమాలు చేశామన్నారు. రూ.23 కోట్ల వ్యయంతో మురికి కాలువల నిర్మాణానికి ప్రత్యేక నిధులు తీసుకొస్తున్నట్లు తెలియజేశారు. రాబోయే నాలుగైదు నెలల్లో ఈ పనులు కూడా ప్రారంభిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇచ్చే రెగ్యులర్ గ్రాండ్ తో పాటు ఇతర మార్గాల ద్వారా నిధులు సమకూర్చి పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. రాయదుర్గం పట్టణ ప్రజా సౌకర్యాలు మెరుగుపరచడానికి నిత్యం సహాయకారిగా ఉంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. అనంతరం పదవ వార్డు పరిధిలో జరిగిన "స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర" కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తమ సొంత ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జనను పూర్తిగా అరికట్టాలని ప్రతిజ్ఞ చేయాలన్నారు, స్వచ్ఛతతో పాటు పరిశుభ్రమైన మరుగుదొడ్లనే ఉపయోగించుకోవాలని తెలియజేశారు. రాయదుర్గం పట్టణ పరిశుభ్రత కోసం ఏడాది కాలంలో 24 వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించామన్నారు. ఇంకా ఎవరికైనా వ్యక్తిగత మరుగుదొడ్ల అవసరం ఉంటే ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. వీటితో పాటు బళ్ళారి రోడ్డు, ఇతర ప్రాంతాల్లో రూ.41.76లక్షల వ్యయంతో సామూహిక మరుగుదొడ్లు నిర్మిస్తామన్నారు. లక్ష్మీ బజార్లో సులబ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే కాలవ పట్టణ ప్రజలకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి నాగరాజు,గుద్దిటి లోకేష్, కార్పొరేషన్ డైరెక్టర్ పురుషోత్తం,మాజీ డైరెక్టర్ ్నటకశాల హనుమంతు,బుదురు తిప్పేస్వామి, సంపత్ కుమారి,కొండాపురం శ్రీనివాసులు దబ్బిడి శివ, పద్మజ,పై తోట రామంజి,యాలపుల వెంకటేశులు,బంగి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల కోసం భూస్వాములకు వ్యతిరేకంగా పరిటాల పోరాటం స్ఫూర్తిదాయకం

పరిటాల రవీంద్ర ఘాటు వద్ద ఎమ్మెల్యే సురేంద్రబాబు ఘన నివాళి

పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

కళ్యాణదుర్గం జనవరి 24 ప్రభాతవార్త

భూస్వాములకు వ్యతిరేకంగా పరిటాల రవీంద్ర పోరాటం చేసి,బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచి, పేద ప్రజల అభివృద్ధి ధ్యేయంగా, పేద ప్రజల సంక్షేమం లక్ష్యంగా నిలిచి, ఆడబిడ్డల మాన ప్రాణ సంరక్షణ కోసం అండగా నిలబడి తన ప్రాణాలను సైతం ప్రజల కోసం, తెలుగుదేశం పార్టీ కోసం అంకితం చేసి, శత్రువులకు వెన్ను చూపని నేత చివరకు శత్రువుల వెన్నుపోటు తూటాలకు బలైన మాజీ మంత్రివర్యులు పరిటాల రవీంద్ర పోరాట స్ఫూర్తి చరిత్ర పుటల్లో నిలిచిపోతుందని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు పేర్కొన్నారు. శనివారం పరిటాల రవీంద్ర 21వ వర్ధంతి సందర్భంగా స్వగ్రామం వెంకటాపురం గ్రామంలో పరిటాల ఘాట్ వద్ద పూలమాలలు వేసి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, టీడీపీ సీనియర్ నాయకులు కంబదూరు రామ్మోహన్‌చౌదరి మోరేపల్లిమల్లికార్జున నాయకుల తోకలసి పరిటాలరవీంద్ర కాటిపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీతమ్మ, ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పరిటాల శ్రీరాములను కలసి పలు అంశాలపై చర్చించారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలు స్వర్ణ గ్రామాలుగా మార్చుదాం-ఎమ్మెల్యే

డి.హిరేహాళ్ జనవరి 24 ప్రభాతవార్త

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ

స్వాచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర లో భాగంగా గ్రామీణ ప్రాంతాలను స్వచ్ఛ గ్రామాలు స్వర్ణ గ్రామాలుగా మార్చేందుకు అందరం కలిసికట్టుగా పని చేద్దామని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం డి.హిరేహాళ్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీవో దాస్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వచ్ఛరథం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలవ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కాలవ మాట్లాడుతు ఇది మంచి కార్యక్రమం స్వచ్ఛందస్వర్ణాంధ్ర పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పట్టణాలు, నగరాల్లో ఈ స్వచ్ఛత మరింత పెంచే అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్, రాయదుర్గం మార్కెట్ యార్డ్ చైర్మన్, తెదేపా మండల కన్వీనర్ పాటిల్ మోహన్ రెడ్డి స్వర్ణ రథం ముఖ్య ఉద్దేశంపై ప్రసంగించారు. సమావేశంలో స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ గ్రామాలు స్వర్ణ గ్రామాలుగ మార్పుపై ఎమ్మెల్యే కాలవ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి బలరామరావు, ఈవోపీఆర్డి యోగానంద, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఎంపీటీసీలు గంగాధర, మొండి మల్లికార్జున, సర్పంచులు రుద్రేశ్, సింగిల్ విండో అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ రామాంజనేయులు, మాజీ మండల కన్వీనర్ మా కాశి వెంకటేశులు, తెలుగుదేశం నాయకులు పెద్దమడి వెంకటరెడ్డి, నారాయణస్వామి, మహాబలి, తిప్పేస్వామి, తిమ్మయ్య, శ్రీరాములు, మంజునాథ, సెట్రూ విజయ్, హేమారెడ్డి, మల్లికార్జున గౌడు, నీలప్ప, శంకరప్ప, బోయ నాగయ్య, కుమార ప్ప, భీమలింగప్ప, శంకర్, అంజిరెడ్డి, కె.బీమారెడ్డి, కనిగిరి వన్నూరుస్వామి, సంగప్ప, గోవిందు, మరి స్వామి, బసవరాజు, నల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత పరిశుభ్రత మనందరి బాధ్యత

- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి

చెత్తను శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే

శింగనమల, జనవరి 24 ప్రభాతవార్త

మండల పరిధిలోని మదిరేపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలోని వీధులలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని క్లాప్ మిత్రులత కలిసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరోగ్య విషయంలో ఎలాంటి విపత్తు పరిస్థితులు ఎదురైనా తమ విధులు నిర్వహించి ప్రజల ఆరోగ్యంగురించి కృషి చేస్తున్న క్లాప్ మిత్రులకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ వందనాలు తెలిపారు. అధికారులు, పంచాయితీ సిబ్బంది గ్రామస్తులు,కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ప్రజలందరికీ స్వచ్ఛత గురించి అవగాహన కల్పించారు. అనంతరం స్వచ్ఛత పరిశుభ్రత పాటిస్తాని మానవ హారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేయించారు. అభివృద్ధి చెందిన గ్రామాల్లో శుభ్రంగా లేకుంటే జరిగిన అభివృద్ధి పాడవుతుందని, కేవలం ఇల్లు మాత్రమే శుభ్రంగా ఉంచుకుంటే సరిపోదు ఇంటి ప్రాంతాలు కూడా శుభ్రంగా ఉంచుకోవాలని ఆమె తెలిపారు. ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అందుకు తగ్గట్టుగా అధికారులు ప్రజలకు అవగాన కల్పిస్తూ ప్లాస్టిక్ నియంత్రణకు కృషి చేయాలన్నారు. అనంతరం క్లాప్ మిత్రులకు డస్ట్ బిన్‌లు, వనిపుట్లు, మెడికల్ కిట్లు ఆమె పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శింగనమల మార్కెట్‌యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు, టిడిపి మండల కన్వీనర్ గోరంట్ల మారుతినాయుడు, సింగిల్ విండో అధ్యక్షులు గుర్రం లక్ష్మినారాయణ, మాజీజడ్పిటిసి శాలిని, ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ ఎం.ఆదినారాయణ, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి అనిల్‌కుమార్‌యాదవ్, టిడిపి సీనియర్ నాయకులు లాయర్ ఈశ్వర్‌రెడ్డి, శింగనమల ఆయకట్టు చైర్మన్ బోయ సత్యనారాయణ, ఎంపిడిఓ భాస్కర్, డిప్యూటీ ఎంపిడిఓ విజయ్‌కుమార్,అక్బర్, మాజీ మండల కన్వీనర్‌గుత్తా ఆదినారాయణ, మాసుల్ చంద్రమోహన్, రహంతుల్లా, మదిరేపల్లి మోహన్‌నాయుడు, రమణ, ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అనంతపురంలో గంధం ఉత్సవాల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి, కేఎం షకీల్ షఫీ

అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి, రాష్ట్ర ముత్తువలీల సంఘం అధ్యక్షుడు కేఎం షకీల్ షఫీ అనంతపురంలో గంధం, ఉరుసు ఉత్సవాల్లో పాల్గొన్న దృశ్యాలు

అనంతపురం, జనవరి 24 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం నగరం పాత ఊరులోని మహల్దార్ స్ట్రీట్ లో వెలసిన సయ్యదా మాసుమా బీబీ (ర.అ) సయ్యదా సారాన్ బీబీ (ర.అ) దర్గా 26వ వార్షిక గంధం ఉరుసు ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. మైనార్టీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముతవల్లిల సంఘం అధ్యక్షులు జామియా మస్జిద్ ముతవల్లి అల్హజ్ కె.యం.షకీల్ సఫీ, దర్గా ప్రెసిడెంట్ హాజీ ఇక్బాల్ మరియు కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ముఖ్య అనంతపురం అర్బన్ శాసనసభ్యులు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు, న్యాయవాది అంగడి ఇషాక్, మున్నా నగర్ రమేష్, ఫిరోజ్ అహ్మద్, నియాజ్ అహ్మద్, తాజూ ఈడి కార్పొరేటర్ జనబలం బాబా, కరీముల్లా, ఏ మహబూబ్ బాషా, ఏ.కాలేషా, ఇమ్రాన్, అస్లాం, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, కులమతాలు అతీతంగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం...స్వర్ణ యాడికి, స్వర్ణ ఆంధ్రను కాపాడుదాం -ఎమ్మెల్యే

యాడికి, జనవరి 24 ప్రభాతవార్త

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి

ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం, స్వర్ణ యాడికి, స్వర్ణ ఆంధ్రను కాపాడుదామంటూ ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. యాడికి మేజర్ పంచాయతీలో శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ రథం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం అధికారులు, ప్రజల తోకలిసి ప్రతిజ్ఞ చేసి ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం, స్వర్ణ యాడికి, స్వర్ణ ఆంధ్రను కాపాడుదాం అంటూ తెలియచేశారు. ఇందులో భాగంగా స్వచ్ఛ రథం ప్రారంభోత్సవం చేసి గ్రామస్తుల నుండి అట్టపెట్టలను, బాటిళ్లను సేకరించి దానికి విలువ కట్టి అంతకు సరిపడా ఇంటి సరుకులను ఎమ్మెల్యే జె.సి స్వయంగా అందించారు. స్వచ్ఛరథం ద్వారా పరిసరాలు పరిశుభ్రంగా ఉండటమే కాకుండా ఇంటికి కావాల్సిన చిన్నపాటి సరుకులు వస్తుండడంతో ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల మూడో శనివారం"స్వర్ణ ఆంధ్రా - స్వచ్ఛ ఆంధ్రా" కార్యక్రమం చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల వారు మండలంలోని ప్రభుత్వ పాఠశాలు, కళాశాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు తదితర విభాగాల వారు అంకిత భావంతో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థికి తీవ్ర గాయాలు

- తెలిసినా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపల్ - ఆందోళన చేపట్టిన తల్లిదండ్రులు

జిజిహెచ్ లో చికిత్స పొందుతున్న విద్యార్థి యశ్వంత్

అనంతపురం న్యూటౌన్ , జనవరి 24 ప్రభాతవార్త

గిరిజన బాలుర రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థి తీవ్ర గాయాలు పాలు అయిన ఘటన బుక్కరాయసముద్రం గిరిజన బాలుర రెసిడెన్షియల్ స్కూలులో గురువారం చోటుచేసుకుంది. ఈ విషయం తెలిసినా ప్రిన్సిపాల్ పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం లోని గిరిజన బాలుర రెసిడెన్షియల్ స్కూలులో గురువారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో విద్యార్థులకు స్పోర్ట్స్ లో భాగంగా బాస్కెట్ బాల్ గేమ్ ఆడించేందుకు పిడి హనుమేష్ నెట్ కట్టించేందుకు ఏడవ తరగతి విద్యార్థి యశ్వంత్ కు చెప్పి పోల్ ఎక్కించారు. అయితే ఆ విద్యార్థి కాలు జారీ కింద పడడంతో ప్రైవేట్ పార్ట్ కు దెబ్బ తగిలి తీవ్రంగా గాయపడ్డారు. అప్పుడు వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నారు. అయితే ఈ విషయం తెలిసినప్పటికీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్జే నాయక్ అర్ధరాత్రి వరకు స్పందించలేదని తెలిసింది. ఆ తర్వాత ఆ విద్యార్థి చికిత్స పొందుతున్న ఆసుపత్రికి రావడంతో ఆ విద్యార్థి తల్లిదండ్రులు ప్రిన్సిపాల్ పై ఆగ్రహం వ్యక్తం చేసి, గోడవకు దిగారు. మా కొడుక్కి ఇంత జరిగినా కూడా మీరు ప్రిన్సిపల్ అయ్యి ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. అయితే ఈ విషయము శుక్రవారం బయటకు వచ్చింది. అయితే ప్రిన్సిపల్ జరిగిన వాస్తవాన్ని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావుకు తెలియజేయకుండా అవాస్తవం తెలియజేస్తూ పక్కదారి పట్టించినట్లు తెలిసింది. అయితే ఈ ఘటనపై జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శుక్రవారం రెసిడెన్షియల్ స్కూలుకు వెళ్లి విచారణ చేపట్టారు. పిడి హనుమేష్ నెట్ కట్టాలని విద్యార్థి యశ్వంత్ కు చెప్పడంతోనే ఆ విద్యార్థి కాలు జారీ కిందకి పడడం వలన గాయపడటం జరిగిందని విచారణలో బయటపడింది. దీంతో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ప్రిన్సిపాల్ పై, పిడి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ కు మెమో, పిడికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని గిరిజన గురుకుల సెక్రటరీకి రిపోర్టు పంపిస్తామని ఆయన తెలిపారు. అంతేకాకుండా శనివారము జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి యశ్వంత్ ను పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆ విద్యార్థి పరిస్థితి ప్రస్తుతం బాగా ఉందని వైద్యులు తెలిపారు. అయితే ఈ ఘటనకు బాధ్యులైన వారిపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నవి ఆ శాఖలో ఉత్కంఠ నెలకొంది.

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

- బాలికల సంరక్షణ అందరి బాధ్యత - జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్



నిత్యవసర సరుకులను పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్

బుక్కపట్నం, జనవరి 24, ప్రభాతవార్త

ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వ్యక్తిగత, పరిసరాలను పరిశుభ్రతను పాటించాలని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రమైన బుక్కపట్నంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని సర్పంచ్ నాగలక్ష్మి అధ్యక్షతన నిర్వహించగా, కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య తనిఖీ, నిత్య అవసర వస్తువులను కలెక్టర్ పంపిణీ చేసి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పారిశుద్ధ్యం యొక్క ప్రముఖ్యతను వివరించి, అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామస్తులు పారిశుద్ధ్య, ఇతర సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ బాలిక దినోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కలెక్టర్ శ్యాంప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యం, సాధికారత దిశగా ముందుకెళ్లాలని, లింగ వివక్షత వంటి సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం బేటి బచావో బేటి పడావో వంటి ప్రభుత్వ పథకాలతో పాటు సమాజంలో ఆడపిల్లల ప్రాముఖ్యతను చాటిచెప్పే విధంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు.ఐసిడిఎస్ పిడి ప్రమీల మాట్లాడుతూ బాలికలు ఎదుర్కొంటున్న సామాజిక అసమానతలు తొలగించి వారిని సమాజంలో సమాన భాగస్వాములుగా చేయడంలో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బాలికలు వారి కలలను, ఆశయాలను సాకారం చేసుకునేందుకు తల్లిదండ్రులతో పాటు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా అధికారులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో బుక్కపట్నం తహశీల్దార్ నరసింహులు, ఎంపీడీవో శ్రీనివాసులు, సిడిపిఓ జయంతి, ఎంఈఓ గోపాల్‌నాయక్, స్థానిక సచివాలయం ఉద్యోగులు, మిషన్ వాత్సల్య సిబ్బంది మురళీధర్, ఆనంద్ స్కూల్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు 'రథసప్తమి' పర్వదిన వేడుకలు

-విద్యుత్ దీప కాంతులతో విరాజిల్లుతున్న ప్రసిద్ధ సూర్యదేవాలయాలు -నేడు ఛాయ ఉషా సమేత సూర్యనారాయణస్వామి కళ్యాణోత్సవం -పెన్నహోబిళంలో శ్రీవారి కళ్యాణోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు -నేటి నుండి ప్రారంభం కానున్న పర్వతేశ్వరస్వామి ఉత్సవాలు

బూదగవి గ్రామంలోని ప్రాచీన సూర్యనారాయణస్వామి ఆలయం, బూదగవి సూర్యనారాయణస్వామి ఆలయంలో కలశస్థాపన చేస్తున్న దృశ్యం, ఆమిద్యాల నుండి పెన్నహోబిళం తెచ్చిన శ్రీదేవీ భూదేవి సమేత నృసింహుని ఉత్సవమూర్తులు

ఉరవకొండ, జనవరి 24 ప్రభాతవార్త

నేటి 'రథసప్తమి' పర్వదిన వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. మండల పరిధిలోని బూదగవి గ్రామంలో వెలసిన 13 శతాబ్దం చోళరాజుల కాలం నాటి సూర్యనారాయ ణస్వామి ఆలయంలోపాటు ఆమిద్యాల గ్రామంలో ని పురాతన సూర్యనారాయణస్వామి ఆలయాల ను రంగు రంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేసి ఛాయ ఉషా సమేత సూర యనారాయణస్వామి కళ్యాణోత్సవానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. బూదగవిలోని సూర్యనారాయణస్వామి ఆలయానికి జిల్లా నలుమూలల నుండే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు తెలంగాణ, కర్నాటక ప్రాంతాల నుండి వేల సంఖ్యలో తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శనివారం మహా గణపతి పూజ, గంగపూజ, గోపూజ, పుణ్యాహ వాచనం, నవగ్రహారాధన, కలశస్థాపన, ప్రధాన దేవతావాహన పూజ, దీక్షా హోమం, జపం, ఏకావర్తి మహాగణపతి, నవగ్రహ, మృత్యుంజయ మూల మంత్ర హోమాలు, అష్టావధాన సేవ కొనసాగింది. ఆదివారం (నేడు) ప్రాతఃకాల షడోపచార పూజ, ఈశ్వరునికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, సూర్యునికి మహాసౌర పూర్వక అరుణ రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం సూర్యనారాయణస్వామి కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు. కాగా పెన్నహోబిలంలో శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి కళ్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. సాయంత్రం ఆమిద్యాల నుండి మేళతాళాల మధ్య శ్రీవారి ఉత్సవమూర్తులను పెన్నహోబిళం ఆలయానికి చేర్చారు. రాయంపల్లి గ్రామంలో వెలసిన పర్వతేశ్వరస్వామి ఉత్సవాలు నేటి నుండి ప్రారంభం కానుండగా ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత (సోమవారం తెల్లవారుజామున) రథోత్సవం జరుగనుంది. ఆయా దేవాలయాలవద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

'రథసప్తమి' ప్రాముఖ్యత : 'రథసప్తమి' అంటే సూర్యున్ని ఆరాధించే పండుగ. సూర్యనారాయణుడు తన రథమును ఉత్తర దిక్కుగా పయనించే రోజుకు గుర్తుగా మహాభారత కాలము నుండి రథసప్తమి పండుగను జరుపుకుంటున్నట్లు చారిత్రక ఆధారములు వున్నాయని ప్రతీతి. రథసప్తమి రోజు ముఖ్యంగా చేసే విధులలో మాఘస్నానం, సూర్యనమస్కారములు, అరుణ పారాయణం, హోమము, ధానము, ధర్మము చేయుట వలన 7 జన్మములలో చేసిన పాపములు తొలగుతాయని శాస్త్ర గ్రంధాలైన మదనరత్నము, ధర్మసింధు, నిర్ణయామృతము వంటి మహా గ్రంథములలో చెప్పబడిందని చెబుతారు. రథసప్తమి తిథిరోజున అరుణ మహాసౌర హోమము, సూర్యనరమస్కారము చేయించినా, ఎర్రని వస్త్రములు, గోధుమలు గురువుకుగాని, బ్రాహ్మణునికిగాని దానమిచ్చిన సూర్యుని పరిపూర్ణ అనుగ్రహము పొంది ఆయురారోగ్యములు పొంది సంతానాభివృద్ధి, రాజయోగము కలిగి సర్వత విజయము పొందురని శ్రీకృష్ణుడు ధర్మరాజుకు ఉపదేశించినట్టుగా భవిష్యోత్తర పురాణము నందు చెప్పబడింది.

హైకోర్టు జడ్జి కే.సురేష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన పెనుకొండ జడ్జిలు

హైకోర్టు జడ్జికి గౌరవ వందనం చేస్తున్న పోలీస్ శాఖ,హైకోర్టు జడ్జిని మర్యాదపూర్